# ప్రారంభ దశ

బెజవాడ దుర్గావిలాస్ భవనంముందు జట్కా ఆగింది. ఎవరిదీ మహా భవనం! బెడ్డింగూ, సామానూ లోపలికి పట్టించాం. ఏమిటీ చొరవ? ఈ ఇంటి యజమాని యెవరు? తెలియకుండా లోపలికి తోసుకుపోవడమేనా?

దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు నవ్వి అన్నారు. "ఆశ్చర్య పడకండి. ఇది నాగేశ్వరరావు పంతులుగారి బెజవాడ నివాస భవనం.

ప్రతి తెలుగువాడికీ ఇది సొంతమే.

ఎవరి తాహతును బట్టి వారి కిందులో ప్రవేశం వుంది. హాయిగా విశ్రమించి యెవరి పని వారు చూచుకుపోవచ్చు."

లోపల ఒక గదిలో స్వేచ్ఛగా ప్రవేశించాం. సామాన్లు సర్దుకుని శేషరాత్రి విశ్రమించాం.

పంతులుగారు నిన్నరాత్రే మద్రాసునుంచి వచ్చి అక్కడ ఉన్నారట. పనివాళ్ళు చురుగ్గా తిరుగుతున్నారు.

"ఇంకేం మరీ మంచిది!" అన్నారు సుబ్బమ్మగారు. మహా చొరవైన మనిషి! లేకపోతే—-ఒక వంక నిప్పుకడిగే ఆచారం, రెండోవంక కులమత వివక్షలేని గాంధీ ఉద్యమం. ఆనాడు—సుమారు 60 ఏళ్ళ

కిందట—ఒక బ్రాహ్మణ వితంతువు తెగించి జాతీయోద్యమంలో దిగి—ప్రచండమైన ఉపన్యాసాలిస్తూ హరిజనోద్ధరణం—వీరఖద్దరుధారణం—ఆనాటి మగరాయళ్ళతో సమాన ప్రతిపత్తి సాధించి తెగేసి మాట్లాడడం - సాధ్యమయ్యే పనులేనా?

ఉద్యమధాటి లేనప్పుడు—నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఒక జాతీయ బాలికా పాఠశాల పెట్టి నడుపుతున్నారు. అందులో తాత్కాలిక సంస్కృతో పాధ్యాయుడుగా చేరి పనిచేస్తున్నాను.

తెల్లవారింది.

స్నానాదులు ముగించి శుభ్రమైన బట్టలు కట్టుకున్నాం. స్వచ్ఛమైన పొందూరు ఖద్దరు వస్త్రంధరించి స్ఫటిక లింగంలావున్న సుబ్బమ్మగారు పంతులుగారిని చూచి మరీ వూళ్ళోకి వెళదామన్నారు.

విశాలమైన గదిలో పంతులుగారు ఒక్కరూ కూర్చుని వున్నారు.

గది అంతా అమృతాంజనం వాసన!

పువ్వుకు వాసనలా పంతులుగారికీ అమృతాంజనానికీ అవినాభావ సంబంధం గాబోలు అనుకుని నవ్వుకున్నాను.

మమ్మల్ని చూసి "రండి" అని ఆహ్వానించారు. యోగక్షేమా లయాయి. మా పాఠశాలకు డబ్బు కావాలి. మే మెందు కొచ్చామో ఆయ నకు విశదమే—ఈమె అడగదు; ఆయన చెప్పరు. ఆయన విశ్వదాత అన్నది—ఇప్పటివారు నమ్మలేనంత గొప్ప నిజం.

ఒక విద్యార్థి పరీక్ష ఫీజు కట్టుకోలేనని కార్డుముక్క రాస్తే మద్రాసు నుంచి మనియార్డరు వచ్చేది.

ఈమా ర్తె పెండ్లి అతివై భవంగా చేసి, సంభులు కోసి ధానధర్మాలు చేసి, బెజవాడ స్టేషన్‌లో మెయిలెక్కితే, ఆలస్యంగా వచ్చినవారు మెయిల్లో ఆయన బోగీ ముట్టడించారట. గంట కొట్టారు. మెయిల్ కదులు తోంది.

పంతులుగారు చేతికి వచ్చినన్ని అయిదు రూపాయల నోట్ల కట్టలు ప్లాట్‌ఫారంమీదకు విసిరి—జాగ్రత్తగా పంపకోండి అని వెళ్ళిపోయారట!

ఆయన నిశితమైన చూపులతోనే ఏమిస్తామన్నారో—ఈమె స్తిమిత నేత్రాలతో ఏమి స్వీకరించిందో—వారికే తెలియాలి !

సంతోషంగా లేచాం.

ఆ రోజున పంతులుగారి పంక్తినే భోజనం.

మల్లెపూవులాంటి ధోవతి ధరించి ఖండువా కప్పుకుని ముఖంనిండా విభూతితో—శివావతారంలా ఒక పీటమీద కూర్చుని మాకోసం ఎదురు చూస్తున్నారు. ఆయన నాగేశ్వరులుకారు. నగేశ్వరుడిలా కనిపించారు. పెరుగు పేలాలు మాత్రమే ఆయన ఆహారంగా తీసుకున్నారు. మేం స్విష్టకృత్తుగా భోజనం చేశాం.

ఊళ్ళో తిరిగిరావడం అయింది.

ముందు షాపులో లేరనిపించిన యజమానులే ఎదురుగా వచ్చి ఆమె నోటిధాటికి వెరచి పదులూ, ఏభై లూ యిచ్చి ఉదారు లనిపించుకున్నారు. పాఠశాలకు బాగా డబ్బొచ్చింది.

మంచి వుత్సాహంగా వుంది.

ఇంకా పొద్దుంది. ఏమిటి చెయ్యడం?

బెజవాడ అనగానే నాకు గుడిపాటి వెంకటచలం జ్ఞాపకం వచ్చారు.

సుబ్బమ్మగారు ఎంత కాంగ్రెసువాదిని, ముందడుగు భావాలు కలదైనా - పుట్టినింటి - మెట్టినింటి వైదిక వాసన పూర్తిగా పోలేదు. చలాన్ని చూసి రావాలని వుంది. చెబితే చంపుతుందేమో అన్నంత భయం. ఊళ్ళోకి వెళ్ళొస్తా నన్నాను.

"ఎక్కడికి?" తప్పదురా దేవుడా అని చెప్పాను. ఆ గాడితప్పిన సాహసుణ్ణి చూద్దామని ఆమెకూ లోపల వుంది కాబోలు! లోకం తిరిగిన మనిషి. జంకూ గొంకూ లేదు. నేనూ వస్తాను పదండి అంది. జట్కా కట్టించుకుని వెదుక్కుంటూ వెంకటచలం గారింటికి వెళ్ళాం.

వరండాలో కుర్చీలమీద కూర్చున్నాం.

పావుగంట యెదురుచూడగా కథానాయకుడు రంగంమీదకు అవతరించాడు.

చేతులులేని బనియను- గళ్ళలుంగీ- పెద్ద కుంకంబొట్టు. బనియన్ జేబులో పెద్ద దువ్వెన, ఎగదువ్విన క్రాపు, విశాలమైన నుదురు. ఆ పెద్ద కళ్ళు చూస్తే ఆయన పేరు తెలియకుండానే ఈయనెవరో అసాధారణ వ్యక్తి అనిపిస్తుంది.

నన్ను నేను పరిచయం చేసుకుని ఈమె ఫలానా అని చెప్పాను. నవ్వి ఊరుకున్నారు.

"మీ రచనలు చదివి కదిలిపోయాను. కొత్త కెరటాలు ఉవ్వెత్తుగా లేచి మీద పడుతున్నట్టనిపించింది. చదవడం మానలేము. ఊపిరి తిరగదు. ఆ రచన, ఆ వేడి మీకే సాధ్యం....మీ భావాలతో ఏకీభవించకపోయినా, ఆ శైలి..." అంటూవుంటే ఆయన ఆపి, వెగటుగా నవ్వి "నిజానికి నాకు భాష రాదు. శైలిలేదు. నా భావాల మారువడే - మిమ్మల్ని కలవర పరుస్తుంది. అదే శైలి అనుకుంటారు..." సంభాషణ తెంచి... "చాలా సంతోషం ... అనుకోకుండా కలుసుకున్నాం" అని లేచారు వెంకటచలం గారు.

అక్కడ తొట్టెలో ఒక చక్కని పసిపాప వుంది ఆడుకుంటూ - సుబ్బమ్మగారు వుండబట్టలేక "ఈ పాప మీ అమ్మాయేనా ?" అని అడిగారు.

చలంగారు సాభిప్రాయంగా చిరునవ్వుతో "ఇక్కడ వున్నంత వరకూ మా పాపే. ఎవరో పెద్దింటిపిల్ల పెళ్ళికాకుండా ఈ పిల్లను కని యిక్కడ వుంచి ఏడుస్తూ వెళ్ళిపోయింది. మేము పెంచుతున్నాం.

డాక్టరు రంగనాయకమ్మగారు యిట్లాంటి వాళ్ళను ఆదుకుని పెంచు తారు...."

సుబ్బమ్మగారు ఆ పిల్లను గురించి యింకా ఏ మడుగుతారో, చలం గారు ఎక్కడ చెలరేగుతాడో అని భయపడి ఆ ప్రసంగం తుంచి - ఖులా సాగా నవ్వుతూ వీడ్కోలు చెప్పి చరచర బండి దగ్గరకు నడిపించాను సుబ్బమ్మగారిని.

తర్వాత మరో ఆరేళ్ళకు ఒక్కణ్ణే చలంగారినిచూసి నాలుగుగంటలు ఆయనతో గడిపాను. ఆయన చలం కాడు; అచలం అనిపించింది. ●